క్లుప్తంగా

త్వరలో విమ్స్ మరుగుదొడ్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో మరుగుదొడ్లు మేజర్ స్థాయిలో మరమ్మతులకు గురికావడంతో వాటిని తాత్కాలికంగా మూసివేశామని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. వాటికి త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు. విమ్స్‌లో ఓపీ, ఇన్ పేషెంట్లు వార్డుల్లో పలు చోట్ల మరుగుదొడ్లు మూసివేశారు. దీంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందిపడుతున్నారు. దీనిపై 'నిరుపయోగం'అనే శీర్షికతో సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి విమ్స్ అధికారులు స్పందించారు. మరుగుదొడ్లలో పైపులైన్లకు మేజర్ మరమ్మతులు కావడంతో తాత్కాలికంగా మూసివేశామని తెలిపారు. విమ్స్‌లో సివిల్, ఎలక్ట్రికల్ ఇతర మరమ్మతుల పనులు జరిపించడానికి రాష్ట్ర వైద్య విభాగం(డీఎంఈ) ఉన్నతాధికారులు విశాఖ ఏపీఎంఎస్ఐడీసీకి అప్పగించినట్లు తెలిపారు. త్వరలో ఈ మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు.

గోదావరి వరద బాధితులకు సహాయం



నిత్యావసరాలతో వెళ్తున్న కార్లను జెండా ఊపి పంపిస్తున్న అసోసియేషన్ సభ్యులు

బీచ్ రోడ్డు: హిమా హ్యూమానిటేరియన్ అసోసియేషన్, సన్ పవర్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో వరద బాధితుల సహాయార్థం వస్త్రాలు, నిత్యావసర సరకులు పంపించారు. ఈ మేరకు మంగళవారం ఆర్కేబీచ్ నుంచి వస్త్రాలు, నిత్యావసర సరకులతో వెళ్తున్న రెండు కార్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శ్రీనివాసరెడ్డి, ఎస్.గోపి, బి.శ్రీనివాసరావు, ఎం.ఎన్.కుమారి, టి.వి.డి.దాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో అన్నదానం



వెంకోజీపాలెంలో భక్తులకు అన్నదానం చేస్తున్న సంఘం సభ్యులు

మద్దిలపాలెం: వెంకోజీపాలెంలో భూలోకమాత అమ్మవారి పండగను పురస్కరించుకుని గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాళ్ల శంకర్, పీలా జోషిలా, కనకరాజు, కస్తూరి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

2న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు రెండో తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. అమర్ రాజా గ్రూప్, సెనర్జీస్ కాస్టింగ్, ముత్తూట్ గ్రూప్, అపోలో ఫార్మసిస్, హెల్త్‌కేర్, శ్రీరామ్ చిట్స్ ఇండియా, డబ్ల్యూఎస్ఎస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలలో 1090 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అసోసియేట్స్, మిషన్ ఆపరేటర్, ట్రైనీ ఆపరేటర్, జూనియర్ రిసెప్షనిస్ట్, ఆఫీసర్ ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్‌టీపీ, ఫార్మసిస్ట్, బెడ్ సైడ్ కేర్ గివర్ (బీసీజీ), మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్స్, రికవరీ ఎగ్జిక్యూటీవ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఎంబీఏ, డిప్లమో, ఫార్మసీ ఏదైనా డిగ్రీ, ఆయా ఉద్యోగాలకు బట్టీ ఉత్తీర్ణత సాధించిన 18–35 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టీ జీతం నెలకు రూ13,000 నుంచి రూ. 20 వేలు వరకు ఉంటుందన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆరోజు 10గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

ధరల మంట!

- తగ్గని కూరగాయల ధరలు
- కొనలేక వినియోగదారులు సతమతం



సగమే నిండిన సంచులతో వినియోగదారులు



ఎంవీపీ రైతుబజార్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఆరిలోవ: కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. బయట మార్కెట్లలో రోజురోజుకూ ధరలు పెరగడం తప్ప, తగ్గడంలేదు. అరకొరగా తగ్గినా సాధారణ వినియోగదారులకు అందుబాటులో లేని ధరలు ఉన్నాయి. రైతుబజార్లలోనూ అదే పరిస్థితి. నగరంలో పెద్ద రైతుబజార్‌గా పేరు పొందిన ఎంవీపీ రైతుబజార్ నిత్యం వినియోగదారులతో కళకళలాడుతుండేది. కొద్ది రోజులుగా పెరిగిన కూరగాయల ధరలు కారణంగా రైతుబజార్‌కు వినియోగదారులు అంతంత మాత్రంగా వస్తున్నారు. దీంతో మంగళవారం ఎంవీపీ రైతుబజార్ బోసుపోయింది.

ఆకాశాన్నంటిన ధరలు

అన్ని కూరగాయల ధరలు బాగా పెరగడంతో సంచుల్లో సగం వరకే కొనుగోలు చేశారు. బెండకాయ కిలో రూ.28, బరబాటి కిలో రూ.28, బీట్‌రూట్ కిలో రూ.28 తప్పా మిగిలిన కూరగాయలన్నీ కిలో రూ.30 పైనే ఉన్నాయి. తెల్ల వంకాయలు (వెల్లంకి) కిలో రూ.46, వేరే ప్రాంతానికి చెందినవి రూ.40, నల్లవి రూ.42, బీరకాయలు రూ.42, కాకర కాయలు రూ.42, బంగాళ దుంపలు రూ.38, ఉల్లి రూ.36, టమోటా రూ.32, బెండకాయలు రూ.30 ధరలతో వినియోగదారులకు అందనంతగా ఉన్నాయి. వీటి ధరలు ఇలా ఉండగా అల్లం, వెల్లుల్లి ధరలు కూడా ఆకాశాన్ని అంటుకున్నాయి. అల్లం కిలో రూ.151, వెల్లుల్లి కిలో రూ.190 ధరలతో కొద్ది రోజులుగా కొనసాగుతున్నాయి.

సంచులు నిండడం లేదు

పెరిగిన ధరల భారంతో గతంలో కిలో, అర కిలోలు చొప్పున కొనుగోలు చేసి సంచినిండా ఇంటికి తీసుకువెళ్లే వినియోగదారులు ఇప్పుడు పావు కిలోలు చొప్పున కొనుగోలు చేసి సంచికి సగం వరకే కూరగాయలు తీసుకెళ్తుండడం కనిపించింది. రైతుబజార్‌లో పెరిగిన ధరలపై నలుగురూ ఒకచోట చేరి చర్చించుకున్న దృశ్యాలు కనిపించాయి. ధరలు తగ్గకపోతే కుటుంబ పోషణ కష్టమని పలువురు నిరాశ వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఆరిలోవ ఎస్ఎస్ 11 కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ మరమ్మతులు జరగనున్నాయి. ఈ మేరకు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరిలోవ ఎస్ఎస్ పరిధిలో సంతపాలెం, తోటగరువు, రవీంద్రనగర్, గాంధీనగర్, అన్నానగర్, శ్రీహరినగర్, కైలాస్‌నగర్, ముస్తఫా కాలనీ, బాలాజీనగర్, తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన ప్రకటించారు.

విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో..

విమ్స్ సబ్ స్టేషన్ 33/11 కేవీ కైలాసగిరి ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ నిర్వహణ పనులు జరగనున్నాయి. ఈ సందర్భంగా విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక కొండవాలు, బీఎస్ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

చినగదిలిలో రక్తదాన శిబిరం

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలిలో మంగళవారం ప్రభాకర్ మెమోరియల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. శిబిరంలో యువకుల నుంచి సేకరించిన 55 యూనిట్ల రక్తాన్ని పినాకిల్ బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు శ్రీనివాస్, వాసు, స్థానిక నాయకులు ఒమ్మి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాహితీవేత్త బాబ్జీకి డి.లిట్ అవార్డు



గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెరహేనీ క్రిస్టినా నుంచి అవార్డు స్వీకరిస్తున్న గణేశ్వర బాబ్జీ

మద్దిలపాలెం: నగరానికి చెందిన ప్రముఖ సామాజిక సాహితీవేత, మిసెస్ ఏవీఎన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీ ప్రతిష్టాత్మకమైన డి.లిట్ అవార్డును స్వీకరించారు. తెనాలిలో కొత్తపేట కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ 36వ వార్షికోత్సవంలో బాబ్జీకి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెరహేనీ క్రిస్టినా ఈ అవార్డును ప్రదానం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డుకు ఎంపిక చేసి అందించిన గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు గ్రహీతను నగరానికి చెందిన నరవ ప్రకాశరావు, సన్మూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

జాలరిపేటలో జీవీఎంసీ కమిషనర్ పర్యటన



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ సంపత్ కుమార్

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ మంగళవారం 19వ వార్డు జాలరిపేటలో పర్యటించారు. వార్డులోని పలు వీధుల్లో పారిశుధ్య నిర్వహణను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ నొల్లి నూకరత్నం అక్కడి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం స్థానిక వీధులతో పాటు బస్ డిపో, బీచ్, శ్మశానవాటిక ప్రాంతాలను కమిషనర్ పరిశీలించి పారిశుధ్యం, బీచ్ క్లీనింగ్‌పై ఆరా తీశారు. బీచ్ క్లీనింగ్ మిషన్ పరితీరును పర్యవేక్షించారు. బీచ్‌లో వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్కడి కంపోస్టు యూనిట్, స్వాపింగ్ సర్వీసస్ స్టేషన్‌లో ఆపరేషన్స్ విధానాన్ని తనిఖీ చేసి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా మువ్వల లక్ష్మి నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న మువ్వల లక్ష్మి

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా మంగళవారం నామినేషన్ వేశారు. తూర్పు నియోజకవర్గ సీనియర్ నాయకుడు మొల్లి అప్పారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 9వ వార్డు కార్పొరేటర్ స్వాతిదాస్, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాణి రోహిణి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత, 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆమెకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా దుర్గారావు, మువ్వల సురేష్, గేదెల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారు సంఘాలకు ప్రోత్సాహం

మహారాణిపేట: రైతు ఉత్పత్తిదారు సంఘాల(ఎఫ్‌పీవో–ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)కు తగిన విధంగా ప్రోత్సాహం అందించాలని, ప్రొడక్ట్స్‌కు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర పథకాల తాలూకా ఫలాలను రైతులకు చేరువయ్యేలా అధికారులు కృషి చేయాలని నిర్దేశించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఎఫ్‌పీవో డిస్ట్రిక్ట్ లెవెల్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని వివిధ రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. రైతులు పండించే పంటలు, వాటి మార్కెటింగ్ అవకాశాలు, స్టోరేజ్ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారు సంఘాలకు అన్ని విధాలుగా సహకారం అందించాలని, వారికి ఆర్థిక ప్రయోజనాలు కలిగే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా సంఘాలు కృషి చేయాలన్నారు. నాబార్డ్ డెవలప్‌మెంట్ మేనేజర్ బసంత్ కుమార్, ఎల్డీఎం శ్రీనివాసరావు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖల అధికారులు, డీఆర్డీఏ పీడీ శోభారాణి, ఉత్పత్తిదారు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమాత మారువారం పండగ



అమ్మవారికి సారే ఊరేగింపు ఉత్సవం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూలోకమాత అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. సాయంత్రం హైదరాబాద్ బోనాల వేడుకను తలపించేలా మహిళలు నీటి బిందెలతో భారీ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి జలాభిషేకం చేశారు. సాయంత్రం వేడుకల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

'సగటు మనిషి జీవన చిత్రమే రావిశాస్త్రి రచనలు'



రావిశాస్త్రి చిత్ర పటం నివాళులర్పిస్తున్న రావిశాస్త్రి జూనియర్లు, అభిమానులు

విశాఖ–లీగల్ : సగటు మనిషి జీవన చిత్రమే రావిశాస్త్రి రచనల సారాంశం అని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం బీచ్ రోడ్‌లోని రావిశాస్త్రి మెమోరియల్ వద్ద 102వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది ఎం.రామదాసు హాజరై రావిశాస్త్రి చిత్ర పటం వద్ద పుష్పగుచ్ఛం నుంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ఆశాదీపంగా పేదల బతుకులే కవిత వస్తువుగా ఎన్నో రచనలు నేటి సమాజానికి కరదీపికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రత్తాలు రాంబాబు, ఆరుసారా కథలు, ఇల్లు వంటి రచనలు మనిషి నిత్యజీవితంలో జరిగే యథార్థ సంఘటనకు అద్దంపడతాయన్నారు. ప్రముఖ న్యాయవాది ఆర్‌వీఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తెలుగు మాండలికాలకు జీవం పోసి ఉత్తరాంధ్ర మాటలకు ప్రాణం పోసిన మహా మనిషి రావిశాస్త్రిని వివరించారు. ప్రముఖ న్యాయవాది కె.వి.రామమూర్తి మాట్లాడుతూ చిన్ననాటి నుంచి రావిశాస్త్రి రచనలు తనను ఎంతో ప్రభావితం చేశాయన్నారు. ముఖ్యంగా న్యాయ శాస్త్ర గ్రంథాలను అతి సాధారణ కథలుగా అందించి యువ న్యాయవాదులకు ఓ మార్గాన్ని చూపించిన రావిశాస్త్రి ఒక సజీవ శిల్పంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి నరేష్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సిరిపురపు కృష్ణమోహన్, నమ్మి సన్యాసిరావు, విశాఖ న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, వైద్యుల రవీంద్ర ప్రసాద్, బీబీ లత, రావిశాస్త్రి కుమారుడు ఉమా శాస్త్రి, ఇతర కుటుంబ సభ్యులు, జూనియర్లు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు కావాలి



ఇసుక డిపో వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లాలో అమలవుతున్న నూతన ఉచిత ఇసుక పంపిణీ విధానం పక్కాగా అమలు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పలువురు అధికారులతో కలిసి ఆయన ఇసుక డిపోలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతన ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో సజావుగా, సులభతరంగా ఇసుక పంపిణీ విధానం అమలుకావాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టి, స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలను పారదర్శకంగా అమలుచేయాలని ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, గనుల శాఖ ఉప సంచాలకులు డీఈవీఎస్ ఎస్ఎన్.రాజు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు. చిత్రంలో సివిల్ జడ్జి వెంకట శేషమ్మ



హాజరైన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, ప్రతినిధులు

మహారాణిపేట: జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ సెంటర్లు వాటి వివరాలు తమ కార్యాలయంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులకు మహిళల హక్కుల పరిరక్షణ, లింగ వివక్షపై లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్‌పై లీగల్ అవేర్ నెస్ ప్రోగ్రాం గురించి వివరించారు. లింగ నిర్ధారణ చేయరాదని, ప్రతి స్కానింగ్ సెంటర్‌లో గైనకాలజిస్ట్ గాని, రేడియాలజిస్ట్ గానీ స్కాన్ చేయాలన్నారు. ఇంగ్లిష్‌తో పాటు ప్రాంతీయ భాషలో సైనేజ్ బోర్డ్స్ ప్రదర్శించాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం. వెంకట శేషమ్మ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ చేయరాదన్నారు. అలా చేస్తే 5 సంవత్సరాల జైలు శిక్ష, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారులు డాక్టర్ బి.ఉమావతి, ఐ.మనోరమ, డాక్టర్ సమత తదితరులు పాల్గొన్నారు.

అందరి అప్రమత్తతతో మెడికవర్‌కు తప్పిన ప్రమాదం



సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

ఎంవీపీ కాలనీ: ఆస్పత్రి సిబ్బంది, నగర ఫైర్ సెఫ్టీ విభాగం, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల అప్రమత్తతతో మెడికవర్ ఆస్పత్రికి ప్రమాదం తప్పిందని ఆ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మెడికవర్ ఆస్పత్రి సెల్లార్‌లోని మైనస్–1 ఫ్లోర్‌లో ఫైర్ యాక్సిడెంట్ జరిగిన విషయం తెలిసిందే. ఈ వివరాలను వెల్లడించేందుకు ఆయన మంగళవారం హాస్పటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అప్రమత్తమైన హాస్పటల్ ఫైర్ అలారం, ఫైర్ డిటెక్షన్ సెక్షన్‌లు అద్భుతంగా పని చేసి ప్రమాదాన్ని నివారించినట్లు ఆయన తెలిపారు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న నగర ఫైర్ సెఫ్టీ విభాగం, ఎన్‌డీఆర్ఎఫ్, పోలీసులు ప్రమాదాన్ని నివారించడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆస్పత్రిలోని ఇతర ఫ్లోర్లలో 300 మంది వరకు రోగులు ఉన్నట్లు చెప్పారు. యూపీఎస్ బ్యాటరీల్లో ప్లెక్సువేషన్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ రీజనల్ హెడ్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో వెలమలకు ఓ కాటేజీ

ఆల్ వెలమ సంక్షేమ సంఘం తీర్మానం



సమావేశమైన వెలమ సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్: వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లే తిరుమల వెళ్లే వెలమ కుల భక్తుల సౌకర్యార్థం వెలమ సంఘ నేతలు తిరుపతిలో వసతి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మించిన శ్రీశైలం, కాశీ పుణ్యక్షేత్రాల్లోని కాటేజీల తరహాలో తిరుపతిలో కూడా భవనాలు నిర్మించాలని ఆల్ వెలమ సంక్షేమ సంఘం ప్రతిపాదించింది. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సంఘ ప్రతినిధులు విశాఖ కేంద్ర సంఘం కార్యాలయంలో సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. తిరుపతి నుంచి వచ్చిన కర్రి సతీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల, నిధుల సేకరణకు రాష్ట్రంలోని వెలమ జాతీయులందర్నీ కలిసి సలహాలు, సూచనలు సేకరిస్తామన్నారు. వెలమ సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా వెలమలంతా ఐకమత్యంతో ఒక్కటై పయనించాలని పిలుపునిచ్చారు. ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బండారు రామకృష్ణ, ఆల్ వెలమ సమన్వయకర్త అల్లు శంకరరావు, గూనూరు వెంకట రమేష్, సిరికి పోతురాజు, సింగంపల్లి రామారావు, కింజరాపు సూర్యనారాయణ, మరడాన శేషగిరిరావు, రంభ బుజ్జి, జి.లక్ష్మణ, గునుపూరు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి టూర్ ప్యాకేజీపై విస్తృత ప్రచారం



సమావేశంలో పాల్గొన్న టూరిజం ఏజెంట్లు

బీచ్ రోడ్డు: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ నూతనంగా ప్రవేశపెట్టిన విశాఖ–తిరుపతి బాలాజీ దర్శనం టూర్ ప్యాకేజీపై విస్తృతంగా ప్రచారం చేయాలని టూరిజం రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి కోరారు. మంగళవారం టూరిజం ఏజెంట్లతో సిరిపురంలోని టూరిజం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి ప్రత్యేక బస్సులో తిరుపతి బాలాజీ దర్శనం సులభంగా చేసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ప్యాకేజీలో దర్శనం టికెట్ కూడా ఉంటుందని, ఏపీటీడీసీ గైడ్ దగ్గరుండి బాలాజీ దర్శనం సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. ఈ టూర్ బుకింగ్‌కు వారం రోజులు ముందుగా రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. పర్యాటకులు ఎవరైనా విశాఖపట్నం నుంచి తిరుపతి బస్సులో ప్రయాణం చేయాలి అనుకుంటే దర్శనంతో పాటు రెండు రోజుల ఈ టూర్ వివరాల కోసం 98484 18582 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. విశాఖ సిటీ టూర్, అరకు, లంబసింగి, పాపికొండలు తదితర టూర్ పాకేజీలు కూడా ఉన్నాయన్నారు.

చట్టాలు సమర్థంగా అమలు చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, చిత్రంలో న్యాయమూర్తులు

విశాఖ లీగల్ : చిన్నారులు, మహిళల అక్రమ రవాణా విషయంలో పోలీసులు అప్రమత్తంగా వుండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. వారి రక్షణకు ఉద్దేశించిన చట్టాలు సమర్థంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక న్యాయ సేవా సదన్‌లో మంగళవారం ఉదయం జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టంపై ప్రత్యేక జువైనల్ పోలీస్ యూనిట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్నారుల అక్రమ రవాణా, మాయం కావడం వంటి కేసులు సమాజాన్ని కలవరపెడుతున్నాయన్నారు. అదేవిధంగా యాసిడ్ దాడులకు గురైన మహిళల రక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలు సమర్థంగా అమలు పరచాలని కోరారు. అందరూ చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సి.కె. గాయత్రి దేవి, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ ఎస్.వరలక్ష్మి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ పాల్గొన్నారు.